అతకని బ్రతుకులు

డి.కామేశ్వరి

అంతవరకు కబుర్లతో, నవ్వులతో నిండిన మెస్ వరండా ఒక్కసారిగా నిశ్శబ్దం అయిపోయింది. కెప్టెన్ మల్హోత్రా, మేజర్ రణధీర్‌సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ జెటీ, లెఫ్టినెంట్ చుగాని అందరూ గుడ్‌నైట్ చెప్పి ఎవరి టెంట్లకి వారు వెళ్ళిపోయారు.

మేజర్ రావు, కెప్టెన్ మూర్తిమాత్రం మిగిలారు.

మెస్ వరండాలో పెట్రోమాక్స్‌చుట్టూ దీపం పురుగులు చుట్టుముట్టి ఎగురుతున్నాయి. దూరంగా కీచురాళ్ళ రొద... లోపల ప్లేట్లు, గ్లాసులు కడిగే శబ్దం, కుర్చీలు, బల్లలు సర్దే చప్పుళ్ళు...దూరంగా వంటశాలల్లో పనివాళ్ళ మాటలు...

రావు మూడోగ్లాసు పూర్తి చేసి, నాలుగోసారి వెయిటర్ని పిలిచాడు. మూర్తి చదువుతున్న మేగజేన్‌లోంచి తలెత్తి చూశాడు. వాచి చూశాడు పన్నెండవుతూంది. వెయిటరు రావు గ్లాసునింపి వెళ్ళాడు.

"కమాన్ లెటజ్‌గో రావ్. ఇటీజ్ టూమచ్ ఫర్ టు డే" అన్నాడు మూర్తి రావు గ్లాసువంక చూస్తూ.

రావు జవాబీయలేదు. రావు ఇప్పట్లో లేచే లక్షణాలు కనపడలేదు మూర్తికి. రావ్‌ని బలవంతంగా లేపకపోతే అలా గ్లాసుమీదగ్లాసు వంటిమీద తెలివివున్నంత

వరకు తాగుతాడని మూర్తికి తెలుసు. అందుకే "రావ్...వెడదాం...పన్నెండయింది" లేచి నుంచుని అన్నాడు మూర్తి.

"యూ కెన్ గో..." రావు గ్లాసులోది ఓ గుటక మింగి, సిగరెట్ దమ్ము లాగి, కుర్చీ కమ్మీమీద తల ఆన్చి, పైకి రింగులెంగులుగా పొగ వదులుతున్నాడు.

"టైం చాలా అయింది రావ్!" మళ్లీ అన్నాడు మూర్తి. రావ్ వినడంలేదు.

రావుని అలా ఒక్కడినీ వదిలి వెళ్ళిపోడానికి మూర్తి మనసు వప్పలేదు. తను వెళ్ళిపోతే...అలా గ్లాసుమీదగ్లాసు తాగి అలా కుర్చీలో వాలిపోతే మెస్ వెయిటర్లు రావ్ జీపుడ్రైవర్ని పిలిచి సాయం పట్టి జీప్‌లో కూలేస్తారు ... డ్రైవరు టెంట్ కి చేర్చి ఆర్డర్లీకి అప్పచెపుతాడు... ఆర్డర్లీ దొరగారి బూట్లువిప్పి పక్కమీదకి చేరేసి రగ్గు కప్పుతాడు...తెల్లారేవరకు రావు యీ లోకంలోకి రాడు.

అలా చాలాసార్లు జరిగింది.

లేకపోతే మరీ వంటిమీద తెలివి తప్పనినాడు – అంటే ఏ రెండు పెగ్‌లో మాత్రమే తాగిననాడు తనే డ్రైవ్ చేసుకుంటూ వెడతాడు జీప్. ఆ రోజు ఖర్మకాలి జీప్‌లో ఎవరన్నా వుంటే ప్రాణాలరచేతిలో పెట్టుకుంటూరు గమ్యం చేరే వరకు.

ఓసారి...రావ్ సంగతి పూర్తిగా అనుభవంలోకి రాలేదు అప్పటి కింకా మూర్తికి.

ఆ రోజు తమ క్యాంప్‌కి పదిమైళ్ళ దూరంలోవున్న యూనిట్‌లో ఏదో పార్టీ జరిగింది. పార్టీ అయ్యేసరికి రాత్రి పన్నెండయింది. వచ్చేటప్పుడు రావ్ జీప్‌లో ఎక్కాడు తను. రావ్ ఆరోజు లిమిట్స్ దాటలేదు రావ్ జీప్ వదలడమే ఏభై మైళ్ళ స్పీడ్‌లో వదిలాడు. ఏభై ... ఏభై ఐదు...మామూలు రోడ్డుమీద తను అంత గాభరాపడలేదు. కాని ఘాట్ రోడ్డు ఎక్కినాకూడా ఏభై ఐదు మైళ్ళ స్పీడుతో జీపు కీచుమని శబ్దంచేస్తూ, రొంపచేస్తూ రావ్ చేతిలో మెలికలు తిరిగిపోతూంటే భయంవేసింది. రాత్రి...కన్నుపొడుచుకున్నా కనపడని కటిక చీకటి...ఒక పక్క ఆకాశాన్నంటే కొండలు ... ఇంకోపక్క అగాధంలాంటి లోయ! అందులో పడితే పడిన్నట్లు ఆచూకీ అయినా చిక్కదు ఎవరికి! కొండమీద సన్నని దారి..! ఎదురుగా ఏదన్నా వెహికల్ వస్తే ఎంతో జాగ్రత్తగా తప్పుకోవాలి! అలాంటి రోడ్డుమీద రావ్ స్పీడు చూస్తుంటే కళ్ళు తిరిగాయి. మలుపు తిప్పినప్పుడల్లా కింద పడతామేమో నని పించేది. "రావ్ ఏమిటిది, స్పీడుతగ్గించు, ఘాట్ రోడ్డు యిది..." రావు వినలేదు. పెదిమలు బిగబట్టి స్టీరింగ్ యిటూ అటూ తిప్పేస్తున్నాడు ఎదురుగా స్థిరంగా చూస్తూ! ఏమిటీ రావ్ యీ లోకంలో

లేదా? వంటిమీద తెలివిలేదా? ప్రాణాల మీద ఆశలేదా?...సర్రుమని తిరిగింది జీపు...మలుపులో ఒక వెంట్రుక వాసిలో తప్పిందిగాని లేకపోతే యీపాటికి లోయలో పడాల్సింది. "రావ్ స్టాపిట్!" కోపంగా అరిచాడు గట్టిగా తను. రావ్ వినిపించుకోలేదు. వళ్ళుమండి స్టీరింగ్ గట్టిగా పట్టుకుని, స్విచ్ ఆఫ్ చేసేశాడు తను. సడన్ బ్రేకుతో ఆగింది జీపు. అప్పటికి యీ లోకంలోకి వచ్చాడు రావు. ఉరిమి చూశాడు. ఆ చూపుచూస్తే జీప్ లోంచి తోసేస్తాడేమో ననిపించింది. ఎందుకాపావన్నట్టు తీక్షణంగా చూశాడు. "రావ్ ఇది ఘాట్‌రోడ్డని మరచిపో యావా? ఒక్క సెకనులో తప్పింది గాని...లేకపోతే..." రావ్ కోపంగా చూశాడు. "ఇఫ్ యూ వాంట్ యు కెన్ గెట్‌డౌన్!" అన్నాడు. నిర్మానుష్యమైన నడిరోడ్డుమీద అర్ధరాత్రి దిగి ఏం చేస్తాడు? భగవంతుడిమీద భారంవేసి కళ్ళుమూసుకు కూర్చున్నాడు. ఆ అనుభవంతో రావ్ జీప్‌లో వెళ్ళడం అంటే భయం తనకి. తనేకాదు రావ్ జీప్ ఎవరూ ఎక్కరు! అందరూ ఎన్నోవిధాల హెచ్చరించారు రావుని యీ విషయంలో!

రావు సిగరెట్ చేతిలో పట్టుకుని కళ్ళు మూసుకుని తల వెనక్కు వాల్చి ఏదో ఆలోచిస్తున్నాడు.

రావుని చూస్తూంటే మూర్తికి ఏదో బాధ కలుగుతూంది!!...రావ్!...ఎందుకిలా మారిపోతున్నాడు! యిదివరకటి రావుకి యీ సంవత్సరంనించి మారిన రావ్‌కి ఎంత తేడా! ఎందుకిలా మారిపోతున్నాడు? ఎందుకిలా తయారయ్యాడు?!

ఎన్నోసార్లు వేసుకునే ఆ ప్రశ్నకి మూర్తికి జవాబు దొరకడంలేదు!

రావ్‌కి, మూర్తికి మొందు పరిచయం పూనాలో యిద్దరూ లెఫ్టినెంట్స్‌గా వున్నప్పుడు జరిగింది. ఇద్దరూ ఇంజనీర్స్!

మొదట అసలు రావుని తెలుగువాడనే అనుకోలేదు మూర్తి. ఆరడుగులపొడుగు, పొడుక్కుతగ్గ లావు. తెల్లటి తెలుపు. ఏ పంజాబీవాడో, కాశ్మీరీవాడో అనుకున్నాడు. పేరువిని ఏ కూర్గువాడో, కన్నడంవాడో అనుకున్నాడు. ఓ సారి రావునోట తెలుగుపాట కూనిరాగం విని ఆశ్చర్యంగా అడిగి తెల్సుకున్నాడు. ఆ పరిచయం అలా ఆరంభించింది.

ఆంధ్రదేశంలో ఆంధ్రులమధ్య వుంటే పక్కింటివాడు చస్తున్నా పట్టించుకోడు అదే ప్రవాసాంధ్రంలో తెలుగుమాట తెలుగుమనిషి కనపడితే ప్రాణం లేచి వచ్చినట్టుంటుంది. అందులో ఆఫీసర్సులో రావ్, మూర్తి ఇద్దరే తెలుగువాళ్ళవడం, ఇద్దరూ ఒకే రాంక్‌వాళ్ళు, సమవయస్కులు అవడంతో ఇద్దరూ మంచి స్నేహితు లయ్యారు కొద్దిరోజుల్లోనే!

అప్పటి స్నేహం...తరువాత యీ మూడేళ్ళుగా, పాకిస్థాన్ యుద్ధం ఆరం

ఖించిన దగ్గరనించి యీ బోర్డరు ఏరి యాస్‌లో మళ్లీ కలిసివుండడంతో ఆప్తులు లేనిచోట యిద్దరూ మరింత ఆప్తులయ్యారు. రావ్ యీ మధ్యే మేజరయ్యాడు! అయినా ఆ చనువు యింకా అలాగే వుంది యిద్దరిమధ్య!

యుద్ధం ముగిసినా... ఆ హడావిడి తగ్గినా వారి స్థావరాలు మారలేదు. యూనిట్ అక్కడేవుంది యింకా. బోర్డరులో రోడ్లు వేయడం, బ్రిడ్జిలు కట్టడం, కందకాలు తవ్వడం...యుద్ధం ఏ క్షణం వచ్చినా ఎదుర్కోడానికి సర్వసన్నాహాలు అన్నమాట!

అంతా నట్టమైన అడవులు! కొండలు...వాగులు...రకరకాల పిట్టలు... ప్రకృతిదృశ్యాలు చూడ్డానికి మొదట్లో బాగానే వుంటుంది అందరికి. రాను... రాను...ఎంత సేపు యూనిఫారాలుతప్ప... మగపురుగులు తప్ప కనపడని ఆ ప్రదేశాలు విసుగుపుట్టించేవి. పెద్దపెద్ద తోటలలో హోదాకి తగినట్టు టెంట్లు...ఆఫీసర్ల టెంట్స్‌కి దూరంగా జవాన్ల టెంట్స్. టెంట్స్‌కి దూరంగా రెండుఫర్లాంగులలో మెస్సు! అంతా క్రమబద్ధమైన జీవితం! లేవడం ... చలిలోనే పెరేడ్ ... బ్రెక్‌ఫాస్ట్ ... ఆఫీసుపని ... లంచ్ ... మళ్లీ పని ... సాయంత్రం ఐదుగంటలకే చీకటి!...ఆ హరికెన్ లాంతర్లముందు చదవడానికికూడా బుద్ధిపుట్టక...అందరూ ఆరుగంటలకల్లా మెస్సు చేరుతారు. టీ తాగి, పుస్తకాలు చదువుతూ, రికార్డు ప్లేయరు వింటూ, పేకాడుతూ, తాగుతూ ఎవరిష్టంవచ్చినట్టు వాళ్ళు సరదాగా గడుపుతారు. డిన్నరయ్యాక ఓఅరగంటో గంటో బాతాఖానీ కొట్టి ఎవరి టెంట్స్‌కి వారు చేరుతారు ... యీ దినచర్యలో మార్పు అంటూవుంటే చుట్టుపట్ల యూనిట్స్‌కి ఏదో పార్టీలపేరుతో నలుగురుకలసి నాలుగైదు గంటలు గడపడం! బొత్తిగా మెకానికల్ లైఫ్! బాచిలర్స్ బాధపడేవారుగాదుగాని, పెళ్ళయినవాళ్ళు కాపురం పెట్టడానికిలేక చికాకుగా వుంటారు!

పుస్తకం తిరగేస్తున్న మూర్తి దృష్టి అంతా రావుమీదే వుంది. రావ్ లేవడం కోసం ఓపిగ్గా కనిపెట్టుకుని కూర్చున్నాడు.

రావు ఎందుకిలా అయిపోతున్నాడు! ఎలావుండే మనిషి ఎలామారిపోయాడు!! సర్వం కోల్పోయినట్లు ఎందుకా దైన్యం! ఎందుకంత నిర్లిప్తత బ్రతుకుమీద! ఏం లోటని! ఏం నష్టపోయాడని ఆ నైరాశ్యం! పూర్వపు చలాకీతనం మచ్చుకైనా కనపడదేం!

రావు!...మనిషి ఎంత అందగాడో మనసూ అంత అందంగా వుండేది! ఎంత సరదాగా వుండేవాడు! రావు ఎక్కడుంటే అక్కడ ఉల్లాసం, ఉత్సాహం వురకలు వేసేది! అతనిచుట్టూ ఎప్పుడూ పదిమంది పోగయివుండేవారు! అతనిలో ఆకర్షణ అలాంటిది అప్పుడు! కొత్త కొత్త విట్లువేస్తూ, పాటలన్నీ వరసలు

మార్చేసి ఇష్టంవచ్చినట్లు పాడి అందర్నీ నవ్వించేవాడు. కాస్త ఫ్రీటైము దొరికితే చాలు పేక పరిచేవాడు. శలవురోజు వస్తే చాలు పిక్నిక్ లనేవాడు. లేకపోతే చుట్టు పక్కల అడవులకి తుపాకులు పుచ్చుకుని షికారీకి బయలుదేర దీసేవాడు! అందమైన అమ్మాయిలకి అందమైన పేర్లుపెట్టి అందంగా వర్ణించేవాడు! సరే, తాగడం ముందునించీ వుందికాని యిలా వళ్లుతెలియని తాగుడుకాదు! రావ్ ఎక్కడుంటే ఆ యూనిట్ అంతా ఉల్లాసంగా వుండేది! పై అధికార్లుకూడా రావ్‌ని ఎంతో అభిమానిస్తూ, ఎంతో ఆదరం అభిమానం చూపించేవారు.

అలాంటి రావు...యిప్పుడు ఎవరితో మాట్లాడడు! నవ్వేలేదు ఆ మొహం మీద!...పేకాటలు, షూటింగ్‌లు మానేశాడు. పార్టీలు, పిక్నిక్‌లు రిఫ్యూజ్ చేస్తున్నాడు. ఎంతసేపూ తాగుడుతప్ప యింకో పనిలేదు! పనికాస్తా అయ్యాక అలా సీసాలు ముందుపెట్టుకుని తాగుతూ, సిగరెట్లమీద సిగరెట్లు తగలేస్తూ అలా అన్యమనస్కంగా కూర్చుంటాడు.

శలవరోజువస్తే టెంట్స్‌కి దూరంగా దట్టంగావున్న చెట్లమధ్య రెండు చెట్లకి హేమక్ వేలాడేసి వెల్లకిలా పడుకుని, పక్కన టేప్ రికార్డరు పెట్టుకుని పడుకుంటాడు సిగరెట్లు కాలుస్తూ! అలా గంటలకి గంటలు తిండితిప్పలుకూడా అక్కరలేకుండా పడుకుంటాడు. తను పిలిస్తే...పదిసార్లు పిలవగా పిలవగా యిష్టమయినరోజు లేచివస్తాడు!

రావుతో అసలు మాట్లాడాలంటేనే యీమధ్య భయంగా వుంటూంది! కోపం ఎంత ఎక్కువయింది! తమ మధ్య స్నేహాన్నికూడా దూరంచేస్తున్నాడు! ఎంత అడిగినా ఏంచెప్పడు! రావుని చూస్తూంటే ఎంత బాధగావుంది! ఎలాంటి వాడు ఎలా అయిపోయా డనిపిస్తుంది!

మొదట్లో రావ్‌లో యీ మార్పుకి... రావ్‌లో నిర్లిప్తతకి కొత్తభార్యా వియోగం అని అర్థంచేసికున్నాడు.

రావ్‌ది లవ్‌మేరేజ్! కెప్టెన్‌గా జబల్‌పూర్‌లోవుండగా పైఅధికారి మేజర్ జనరల్ కూతురిని పెళ్ళిచేసుకున్నాడు. రావ్ తల్లిదండ్రులకి యీ పెళ్ళి యిష్టం లేదు; పంజాబి అమ్మాయి అని వాళ్ళిష్ట పడకపోయినా లెక్కచేయకుండా రిజిష్టర్ పెళ్ళి చేసుకున్నాడు.

రావ్ భార్య చాలా అందగత్తెట! అందరూ అన్నారు! లెఫ్టినెంట్ కల్నల్ జెట్లీకి రావ్ మామగారు తెలుసు! చాలా సార్లు అన్నాడు!

అంత అందగత్తె అయిన భార్య! హోదా, సిరిసంపద అన్నీవుండి రావ్‌లో ఎందుకీ నిస్తేజం? నిర్లిప్తత!

పెళ్ళయ్యాక ఓ ఆరునెలలు మాత్రమే ఇద్దరూ కలసివున్నారు...తరువాత రావ్ ఫ్రంట్‌కి రావల్సి రావడంతో ఆమె ప్రస్తుతం ఢిల్లీలో పుట్టింట్లో వుందిట!

పెళ్ళయిన వెంటనే భార్యని వదల వలసివచ్చినందుకు రావు ఎంతో ఇదయ్యే వాడు! మనిషిక్కడ, మనసక్కడ అన్న ట్లుండేవాడు. ప్రతి రెండుమూడు నెలలకి షార్టులీవు తీసుకుని భార్యదగ్గరకి పరి గెత్తేవాడు. రెండురోజులకో ఉత్తరం తావులు తావులు రాసేవాడు! జాలేసేది రావు ఆరాటం, అవస్థ చూస్తే! ట్రాన్స్ ఫర్ కోరుతూ ఎన్నో దరఖాస్తులు పెట్టాడు...

అలాంటిది...ఓసారి పదిరోజులు శలవు తీసుకుని వెళ్ళినవాడు నాలుగో రోజునే వచ్చేశాడు లీవు కాన్సిల్ చేసుకుని. అప్పటినించి యీ ఏడాదిలో ఒక్కసారీ ఢిల్లీ వెళ్ళలేదు.

అంతే!...అప్పటినించి యిదీవరస!

భార్యతో ఏదన్నా తగూవచ్చి వుంటుందా? వస్తేమాత్రం భార్యాభర్తల కోపం యిన్నాళ్ళుంటుందా? అంత అంద గత్తె అయిన భార్య, ఏరికోరి చేసుకున్న భార్యాభర్తలమధ్య అభిప్రాయభేదా లెందుకు వొచ్చివుంటాయి? రావులో మార్పుకి కారణం అదా? కాదా?

జవాబు తెలియదు మూర్తికి.

ఆలోచనలమధ్యరావుని గమనించలేదు మూర్తి, మెస్ నౌకరు వచ్చి పిలిచేవరకు. అప్పటికి...రావు ముందు టేబిల్‌మీదకి వాలివున్నాడు. మెల్లిగా నౌకరు సాయంతో రావుని జీపులో చేర్చి టెంట్‌కి తీసకెళ్ళాడు మూర్తి

* * *

ఆరోజు శలవు మధ్యాహ్నం నిద్ర లేచి బద్ధకంగా ఆవులిస్తూ టెంట్‌కి వచ్చాడు మూర్తి.

అందరూ రాత్రి పార్టీనించి చాలా ఆలస్యంగా వచ్చారేమో మంచి నిద్రలో వున్నారు. అంతటా నిశ్శబ్దంగా వుంది. పక్కనే పారుతున్న వాగు శబ్దం... అప్పుడప్పుడు పక్షుల కిలకిలారావాలు... ఎంతో ప్రశాంతంగావుంది అంతటా!... పక్క టెంట్‌లోకి చూశాడు మూర్తి. రావు టెంట్‌లో లేడు! అంటే...ఎక్క డుంటాడో మూర్తికి తెలుసు!

చన్నీళ్ళతో మొహం కడుక్కొని రావు దగ్గరకి బయలుదేరాడు మూర్తి.

యధాప్రకారం హేమన్ వేలాడేసి తలకింద చేతులు పెట్టుకుని కళ్ళుమూసు కుని పడుకున్నాడు రావు.

పక్కన ఫోల్డింగ్ టేబిల్‌మీద టేప్ రికార్డర్ మెల్లిగా తలత్ ఘజల్ పాడు తూంది...

"రో...రో...బీతా జీవన్‌సారా...
జీవన్‌సారా...
ఆయే న మన్‌కామీత్ హమారా...
రో...రో...బీతా ...
ఖుషియోంకా సబ్‌గీత్ చురాకర్ ...
ప్యార్‌కా జల్‌తా దీప్ భుజాకర్
టూట్‌లియా సారాజీవన్ ... మైహూ
అకేలా...రో...రో..."

తలత్ గొంతులోని విషాదం వింటూంటే...రావు మనసులో నిండిన

బాధనే ఆలాపిస్తున్నాడా అనిపించింది... అలా ఏదో పోగొట్టుకున్నవాడిలా పడుకున్న రావుని చూస్తుంటే బాధనిపించింది.

రావు నిద్రపోతున్నాడేమో...మూర్తి వచ్చిన అలికిడికూడా కళ్ళు విప్పలేదు. పక్కనున్న కాన్వాసు కుర్చీ జరుపుకుని కూర్చున్నాడు మూర్తి. రావు అంతవరకు చదివి పెట్టిన పుస్తకం తీసుకున్నాడు. పుస్తకంలోంచి ఓ ఫోటో జారి కింద పడింది గడ్డిలో! వంగి తీసిన మూర్తి చూపు అట్టే నిలిచిపోయింది! అబ్బ!... ఏం అందం!

రావు భార్య ఫోట్లో గాబోలు! టూ రావ్ డార్లింగ్' — 'ప్రీతి' అని వుంది ఫోటో వెనకాల!

ప్రీతి!...ఎంత చక్కని పేరు! ఫోటోలోనే ఎంత అందంగా, ఎంత కోమలంగా కనిపిస్తూంది! ఆ కనుబొమలు, చిరునవ్వు చిందించే ఆ పెదాలు...నుదుటిపై పడే ఆ వంకులజుత్తు...

అందరూ అంటే ఏమిటో అనుకున్నానుగాని ఇంత అందగత్తె అనుకోలేదు...అనుకున్నాడు మూర్తి. పరాయి స్త్రీ, స్నేహితుడి భార్యఅన్న సంగతికూడా మరచి తదేకంగా ఫోటో చూస్తూ వుండిపోయాడు

ఎంత అదృష్టవంతుడు రావు! ఇంత చక్కని భార్యనుంచుకుని ఎందుకలా ఏదో కొంపమునిగినట్లుంటాడు. ~~షీలీ పెల్లో~~!

రావు కాస్త కదిలాడు... మూర్తి తొందరగా ఫోటో పుస్తకంలో పెట్టేసి, పుస్తకం టేబిల్ మీద పెట్టేశాడు.

రావు లేచాక ఏదో మాట్లాడుతున్నా... మూర్తి ఆలోచనలు ప్రీతిచుట్టూనే వున్నాయి.

* * *

తరువాత రెండునెలలకి.

మూర్తి ఢిల్లీ వెళ్ళాడు బ్రిగేడియరు రెడ్డిగారి కూతురి పెళ్ళికి. రెడ్డిగారు, మూర్తి తండ్రి ఒక ఊరివారు, ఆప్త మిత్రులు! మూర్తిని ఇంట్లో తమ కొడుకు లాగే చూసుకుంటారు రెడ్డిదంపతులు. ఎప్పుడు ఢిల్లీ వెళ్ళినా మూర్తి రెడ్డిగారింట్లోనే మకాం.

పెళ్ళికి కాస్త ముందువచ్చి సహాయ పడాల్సిందని రెడ్డిగారు చాలాసార్లురాశారు. మూర్తి తండ్రికూడా తన తరపున కొడుకుని పెళ్ళికి వెళ్ళమని పురమాయించాడు.

మూర్తి మొత్తం వారంరోజులు శలవు తీసికుని వెళ్ళాడు.

ఉదయం పెళ్ళి ఆడంబరంగా, అట్టహాసంగా ముగిసింది. సాయంత్రం ఓ పెద్ద హోటల్లో రిసెప్షన్ ఏర్పాటుచేశారు. విందుకి పెద్దపెద్ద మిలటరీ అధికారులు హాజరయ్యారు భార్యలతో! చాలా కలర్ ఫుల్‌గా వుంది పార్టీ

మూర్తికూడా ఓ హోస్టు అయి అతిథులందరిని ఆహ్వానిస్తూ పానీయాలు అందిస్తూ చాలా హడావిడిగా తిరుగుతున్నాడు. అందరూ మిలటరీవారవడం చేత పరిచయస్థులు గుంపులుగుంపులుగా నిల్చుని, కూర్చుని రంగురంగుల పానీయాలు తాగుతూ నవ్వుకుంటూ మాట్లాడుతున్నారు.

డ్రింక్స్ ఆఫర్ చేస్తూ, గెస్టులని ఆహ్వానిస్తూన్న మూర్తి గుమ్మంలో మెరుపు మెరిసినట్లనిపించి తిరిగి చూశాడు

ప్రీతి! ... రావు భార్య! .. రావు భార్యేనా?...

అచ్చు అలాగే వుంది! ఫోటోలో కంటె వెయ్యిరెట్లు అందంగా వుందనిపించింది మూర్తికి. ముట్టుకుంటే రక్తం చిందుతుందేమో ననిపించే కోమలత్వం! పొడుగ్గా, సన్నగా, నాజూగ్గా...లేగులాబి రంగు ఎందుకు పనికివస్తుంది ఆ రంగు ముందు! వంటి రంగుకి, చీర రంగుకి తేడా తెలియని లేగులాబి ఎంబ్రాయిడరీ చేసిన ఫారెన్ షిఫాన్ చీర, అదేరంగు స్లీవ్ లెస్ జాకెట్టు, అందంగా ఆధునికంగా చుట్టిన జుత్తుముడి, గులాబి చెప్పులు, గులాబి హేండ్‌బాగ్... సిగలో విరిసి విరియని గులాబి... పైనించి క్రింద దాకా మంచులో తడిసి ఉషాకాంతిలో మెరిసిపోయే లేగులాబిలా వుంది!

రెప్ప వేయడం మరచిపోయాడు మూర్తి.

ఇంత అందం!...అన్నీ ఇలా ఒకి చోట కలియడం అపురూపం. యింత అద్భుతమైన అందం చూడగలిగి తన

అదృష్టాన్ని అభినందించుకున్నాడు మూర్తి! రావు అదృష్టానికి ఆ క్షణంలో ఎంతో అసూయకలిగింది మూర్తికి.

ఇంత అదృష్టానికి స్వంతదారుడయి ఆ రావు ఆముదం తాగిన మొఖంపెట్టుకుని కూర్చుంటాడేం!

ఆమెప్రక్కన పొడుగ్గా, సన్నగా, తెల్లగా వున్న ఓ యువకు డున్నాడు. ఇద్దరు ఒకరినొకరు రాసుకుంటూ, నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ లోపలికి వస్తున్నారు.

మూర్తి ఎదురెళ్ళాడు ఆహ్వానించడానికి సంభ్రమంగా. నమస్కారంచేసి తనని పరిచయం చేసుకుంటూ ఇద్దర్ని సోఫాల దగ్గరికి లీడ్ చేశాడు.

"ఏం తీసుకుంటారు?" వంగి, మర్యాదగా అడిగాడు హిందీలో.

"ఎనీథింగ్!" నెమ్మదిగా నవ్వుతూ అంది ఆమె.

రెడ్డిదంపతులు వచ్చి పలకరించారు. మిసెస్ రెడ్డి ఏదో అడిగింది కాబోలు, "డాడీకి వంట్లో బాగులేదు... మమ్మీ నన్ను వెళ్ళమంది. అందుకు...రాజేన్ వస్తూంటే అతని కారులో వచ్చాను..." అంటూంది హిందీలో.

ఆ క్షణంనించి మూర్తి చుట్టూ చూడ్డం మానేసి ఆమెమీదే దృష్టిపెట్టుకుని కూర్చున్నాడు. రావలసిన గెస్టులు అందరూ వచ్చేశారుకనక తీరుబాటుగా ప్రీతి సోఫాకి కాస్తదూరంగా కూర్చుని ఆమెని సునిశితంగా గమనించసాగాడు మూర్తి.

ఆమె ఏమాత్రం అభ్యంతరం చెప్పకుండా ఓ గ్లాసు షాంపైన్, మరో పెగ్ విస్కీ తాగడం...మగవాళ్ళతో చేతులు కలుపుతూ ఛలోక్తులు ఆడడం..మ్యూజిక్ మొదలవగానే అడిగిన అందరితో డాన్సు చేసే ఆమె అడుగుల చాతుర్యం, ఆమె శరీరం వంపుల్ని, ఆమె హొయలని, విలాసాన్ని...రెప్పవేయకుండా చూశాడు మూర్తి.

ఆమెకి తెలియనివారే లేరులావుంది! 'హలో!' అని అందరూ పలకరిస్తున్నారు. నవ్వుతూ ఏదో మాట్లాడుతున్నారు...చేతులుకలిపి ఏదో ప్రశ్నిస్తున్నారు...అందరితో చనువుగా మాట్లాడుతూంది...ఒకోసారి ఎందుకో విరగబడి నవ్వుతూంది...

మూర్తి యింక చూస్తూ కూర్చోలేకపోయాడు. ఆమెని పరిచయం చేసుకుని మాట్లాడాలి! రావు ఫ్రెండునని పరిచయం చేసుకోవాలి!

ఆమె వంటరిగావున్న క్షణంకోసం ఎదురుచూసి ఆమె పక్కన నిలబడ్డాడు. ఆమె చిరునవ్వుతో కళ్ళెత్తి చూసింది.

తనని తాను పరిచయం చేసుకున్నాడు...మూర్తితో చేయికలిపి 'హౌ డు యూ డూ...' అంది సుతారంగా. ఏవో మర్యాదమాటలు నాలుగు మాట్లాడింది. అదే అదనని రావు తన కెంత ఆప్తమిత్రుడో తెలియచెప్పాడు మూర్తి.

అంతవరకు నవ్వుతూ మాట్లాడిన ఆమె మొహం కాస్త ఎర్రబడింది

ఐసీ! అంది క్రిందపెదవి కాస్త నొక్కిపట్టి.

వెంటనే ఎవరో పిలుస్తున్నట్టుగా, ఎవరినో పలకరిస్తూ తొందరగా అక్కడ నించి ఇంకోవైపు వెళ్ళిపోయింది.

మూర్తి చాలా నిరుత్సాహ పడ్డాడు. ఆమెతో ఎన్నో మాట్లాడ్దా లనుకున్నాడు. రావులో మార్పుగురించి చర్చించాలని, రావ్‌లో సభ్యతకి విరుగుడు మీరేనని చనువుచేసుకుని చెప్పాలని ... ఎన్నో చెప్పాలని అనుకున్నాడు. కాని అలా అంటీ అంటనట్టు తెంచుకుని ఆమె వెళ్ళిపోతే మళ్లీ వెళ్ళి వెంటబడి మాట్లాడడం ఏం సభ్యత అని వూరుకున్నాడు. తరువాత ఉత్సాహం అంతా చచ్చిపోయినట్లయింది మూర్తికి.

పార్టీ ముగిసింది.

* *

కారులో రెడ్డి దంపతులతో ఇంటికి వస్తుంటే ప్రీతిగురించి తెలుసుకోవాలన్న ఆరాటాన్ని అదుపులో పెట్టుకోలేక పోయాడు మూర్తి.

"ఆమె ఎవరు! ఆ ప్రీతి అన్న ఆమె చాలా ఫార్వర్డ్‌గా వుందే! చక్కగా డ్రింక్స్ తాగేస్తోందే ... డాన్సుకూడా బాగా చేస్తూంది ... ఎలాగైనా పంజాబి లేడీస్ చాలా ఫార్వర్డ్‌గా వుంటారు గదూ!..." సంభాషణకి ఉపక్రమించాడు ఏం తెలీనట్టు మూర్తి.

రెడ్డిగారు కొంటెగా నవ్వారు... "నీ కళ్ళుకూడా ఆ అమ్మాయిమీద పడ్డాయన్నమాట! నో యూస్ మై బాయ్! ఎ యీజ్ ఆల్‌రెడీ మారీడ అన్నారు భార్యవైపు నవ్వుతూ చూసి.

మూర్తి సిగ్గుపడ్డాడు.

"ఒక్క పెళ్లేంఖర్మ !...చేసుకోడానికి వీలయితే రోజుకో పెళ్ళి చేసుకునేది" ఎకసక్కెంగా అంది మిసెస్ రెడ్డి.

"మరీ అంతలా మాట్లాడకు...మీ ఆడవాళ్ళకి తమకంటె అందమైన ఆడదాన్ని చూస్తే అసూయ..." ఉడికించినట్లు అన్నారు రెడ్డిగారు.

"చాల్లెండి! నాకా అమ్మాయినిచూస్తే అసూయ ఏమిటి?... ఏ భై ఏ ళ్ళు వచ్చాయి; నా కూతురివయసు అమ్మాయినిచూసి నా కసూయ ఏమిటి? ఆవిడగారి బుద్ధులనిబట్టి అలా అన్నానుగాని..."

"ఆ...ఇదిగో పులంటే అదిగో తోకం టుంది లోకం!... కాస్త ఫార్వర్డ్‌గా వుంటే ఏదో అంటారు...అవన్నీ నిజమనుకోడం...నిజమని మనమూ అనడం" భార్యని మందలిస్తున్నట్టు అన్నారు.

"నేను నోరు మూసుకుంటే లోకం మూసుకుంటుందా? ఆ అమ్మాయి తిరిగే తిరుగుళ్ళు, అర్థరాత్రిదాకా నాట్యాలుచేసే క్లబ్బులు, ఆడదాన్నని మరచిపోయి మగాళ్ళతో సమానంగా తాగడం, అడగని మగాడిదిపాపం అన్నట్టు రోజుకోడితో సినిమాలు, షికార్లు, క్లబ్బులంట తిరగడం ఎవరికి తెలీంది... కాస్తోకూస్తో నిప్పు లేందే పొగ ఎందుకు వస్తుంది...?"

"ఏమో. మన కెందుకు...టూ ఫార్వర్డ్‌లే ఆ అమ్మాయి..." రెడ్డి అన్నారు మూర్తివంక చూస్తూ



"మొగుడు దగ్గర లేదేమో ఆ తిరుగుడుకి మరీ అంతుపొంతు లేదు...అసలు మొగుడికి పెళ్లానికి అంచేతే పడటంలేదని, మొగుడు అందుకే రావడంలేదని అంటారు...ఎంతవరకు నిజమో!"

"అదంతా ఏం లేదులే!"

"లేకపోవడం ఏమిటి...మొన్న మిసెస్ సిన్హా అంది...భార్యాభర్తలకి పడడంలేదని...యీవిడ వ్యవహారం నచ్చక...చెప్పినా లక్ష్యపెట్టలేదని అతను

అసలు రావడం మానేశాడట!...ఉత్త రాలు కూడా రాసుకోడంలేదట ఆఖరికి..."

"ఆ...యీవిడ వెళ్ళి చూసిందా? లేకపోతే వాళ్లు వచ్చి చెప్పారా?...

"ఇలాంటివి ఎక్కడ దాగుతాయండి. వీళ్ళయిల్లు, వాళ్ళయిల్లు పక్కపక్క నేగా. వాళ్ళ ఆయా మిసెస్ సిన్హాతో అందిట. రెండుమూడుసార్లు ప్రీతి మొగుడు వూరినించి వచ్చేసరికి యీవిడ గారు ఎవరెవరి కారులలోనో అర్ధరాత్రి దిగడం, ఆ నవ్వులు, ఆ వికారాలు అవి చూశాడట అతను. రెండుమూడుసార్లు చూశాక ఓసారి యిద్దరూ దెబ్బలాడు కున్నారట. ఇలాంటివి నాకు నచ్చవు... యీ అర్ధరాత్రి క్లబ్బుల తిరుగుడు మానేయ'మన్నాడట.

'పదోశతాబ్దపు మనిషిలా మాట్లాడకు. తిరిగితే తప్పేమిటి?' ప్రీతి అందిట.

'నాగరికత అంటే రోజుకో మొగాడితో తిర్గగడం కాదు...నా భార్య అలా తిరగడం నా కిష్టంలేదు' అన్నాడట అతను. 'అలా నా కిష్టం' అందిట ప్రీతి పెంకిగా

అంతే వున్నపాటున వెళ్ళిపోయాడట అతను...మరి రాలేదుట అప్పటినించి." అంతా-చూసినట్టు, విన్నట్టు విశదపరచింది మిసెస్ రెడ్డి.

"అతను తెలుగువాడు ... మిలటరీ వాడే, మేజర్ అనుకుంటాను ... ఎంత యినా తెలుగువాడు...మన సంస్కృతికి, వీళ్ళ ఆచారవ్యవహారాలకి తేడావుంటుంది. అందులో ప్రీతి - ప్రీతి కుటుంబం ముందు నించి చాలా ఫార్వర్డ్‌గా వుండే మనుష్యులు...అతనికి ఇదంతా సరిపడినట్టు లేదు.." రెడ్డిగారు సాలోచనగా అన్నారు

"ఉత్త ఫార్వర్డ్‌నెస్ అయితే అందరూ యింకోలా ఎందుకంటారండీ... ఆ అమ్మాయికి ముందునించీ మరీ ఎక్కువ ఫ్రీడమ్ ఇచ్చేశారు తల్లీతండ్రీ...ఇష్టం వచ్చినట్టు ప్రతీవారితో రాత్రనక పగలనక తిరగడం ముందునించీ వుందట...యీ అమ్మాయి అందంచూసి మోసపోయి వుంటాడు పాపం అతను...నిక్షేపంలా మంచి అందంగా, మంచి పొజిషన్‌లో వుండే మొగుడుండగా యీ తిరుగుళ్ళు ఎందుకో!... యిన్నాళ్ళు ఓ మేజర్‌తో తిరిగింది, యిప్పుడు యీ కెప్టెన్ రాజేన్‌ని పట్టింది ... ఏ మొగుడు భరిస్తాడు యీ వ్యవహారం అంతా..."

భార్యాభర్తల సంభాషణ అంతా మౌనంగా విన్న మూర్తికి యింకేం అడగ నవసరం లేకుండానే అంతా అర్థం అయింది.

కొద్దిక్షణాలకిందట రావు అదృష్టానికి అసూయపడ్డ మూర్తే యీ క్షణంలో రావుని తల్చుకుని 'పూర్ ఫెలో' అని నిట్టూర్చాడు.